సాక్షి చిత్తూరు

గురువారం । 15 । జూన్ । 2023



ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు

జగన్న కాలనీల్లో ఇళ్ల ముందు ఇంకుడు గుంతల ఏర్పాటుకు గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. - 4లో



డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రారంభం

చిత్తూరు : జిల్లాలోని దిశా పోలీస్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. - 4లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	41	28
తిరుమల	36	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : డాక్టర్ వైఎస్ఆర్ కడపలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 2023–24 విద్యాసంవత్సరంలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 4వ తరగతిలో 40, 5వ తరగతిలో 11 సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. 4వ తరగతికి 8 నుంచి 9 ఏళ్లలోపు బాల, బాలికలు (01–08–2014 నుంచి 31–07–2015 మధ్య), 5వ తరగతికి 9 నుంచి 10 ఏళ్లలోపు బాల, బాలికలు (01–08–2013 నుంచి 31–07–2014) మంధ్య జన్మించిన వారు జనన ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. జూన్ 16 నుంచి 21వ తేదీ వరకు మండల స్థాయి ఎంపికలను మండల కేంద్రంలోనూ, జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 23న 4వ తరగతి, 24న 5వ తరగతి బాల, బాలికలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(మెసానికల్ మైదానం)లో నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికయ్యే వారు ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మైదానంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యే బాల, బాలికలు కడప జిల్లాలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ పొందుతారని వెల్లడించారు.

జిల్లాకు విద్యుత్ సామగ్రి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విద్యుత్ సామగ్రి వచ్చినట్టు ట్రాన్స్‌కో సాంకేతిక విభాగం ఈఈ సుబ్బారావు తెలిపారు. విద్యుత్ మీటర్లు 12,500, సబ్‌స్టేషన్‌లో వినియోగించే బ్రేకర్లు 6 వచ్చినట్టు పేర్కొన్నారు. సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి సామగ్రి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బోయకొండ చైర్మన్ పదవికి నాగరాజరెడ్డి దరఖాస్తు



వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో చైర్మన్ అభ్యర్థి నాగరాజారెడ్డి

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవికి పుంగనూరుకు చెందిన నాగరాజారెడ్డి బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకుడు జయరామిరెడ్డితో కలిసి బోయకొండ గంగమ్మకు పూజలు చేశారు. దరఖాస్తు ప్రతులను అమ్మవారి పాదాల చెంత ఉంచి అనంతరం అధికారులకు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో చైర్మన్‌గా నాగరాజారెడ్డి ఎన్నిక లాంఛనంగా మారింది. కార్యక్రమంలో నేతలు చంద్రారెడ్డి యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



థ్యాంక్యూ జగన్ మామ అంటూ ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ విద్యా విభాగం జిల్లా అధ్యక్షుడు చీలేపల్లి రవి తెలిపారు. ఆయన బుధవారం వడ్డిపల్లి వద్ద బీసీ హాస్టల్ విద్యార్థులు నిర్వహించిన థ్యాంక్యూ జగన్ మామ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యా కానుక అందుకున్న విద్యార్థులు థ్యాంక్యూ జగన్ మామ పేరిట ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చీలేపల్లి రవి మాట్లాడుతూ నాడు– నేడు కార్యక్రమం ఆదర్శంగా తీసుకుని ప్రధాని మోదీ 14 వేల బడుల్లో ఈ మార్పులకు శ్రీకారం చుట్టారని చెప్పారు.

ఇంటర్నెట్‌లో డీఎడ్ హాల్‌టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : డీఎడ్ పరీక్షలు రాసే విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను www.bse.ap.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. డీఎడ్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అమ్మకు హైబీపీ!

- చిత్తూరులోని గిరింపేటకు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం రెండు నెలల క్రితం నగరంలోని జిల్లా ఆస్పత్రిలో చేరింది. ఆమెకు బీపీ ఉందని, కాన్పు కష్టమవుతుందని వైద్యులు సిజేరియన్ చేశారు. శిశువు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే తిరుపతి రుయాకు పంపించారు. అక్కడ చికిత్సపొందుతూ బిడ్డ రెండోరోజే మృతి చెందింది. ఆ వెంటనే తల్లి పరిస్థితి విషమంగా మారడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. అక్కడ ఆమె కూడా వారం రోజులకు మరణించింది.
- తవణంపల్లెకు చెందిన కవిత (పేరు మార్చాం)కు ఆరునెలల క్రితం పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు హైబీపీ ఉండడంతో వైద్యులు హైరిస్క్ కేసుగా గుర్తించి సుఖ ప్రసవం కోసం ప్రయత్నించారు. కుదరకపోవడంతో సిజేరియన్ చేసేశారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఇంటికి చేరుకున్నారు.

ఇవి మచ్చుకు రెండు మాత్రమే.. జిల్లాలో ఇలా హైబీపీ బారిన పడి పెద్దసంఖ్యలో గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి హైరిస్క్ కేసులను సకాలంలో గుర్తించకపోవడం వల్ల కొందరు ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. బీపీ మహమ్మారి తల్లులతోపాటు బిడ్డలను కబళించేస్తోంది. ప్రమాద ఘంటికలు మోగిస్తున్న హైబీపీ మరణాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ప్రెగ్నెన్సీ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే రిస్క్ తగ్గించుకోవచ్చని సూచిస్తోంది. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తోంది.

- అధిక రక్తపోటు బారిన పడుతున్న గర్భిణులు
- జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న హైరిస్క్ కేసులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- మరణాల కట్టడికి ప్రభుత్వం చర్యలు

చిత్తూరు రూరల్ : మహిళల్లో కొందరికి గర్భం దాల్చకముందు నుంచే హైబీపీ ఉంటుంది. మరికొందరిలో గర్భం దాల్చిన 20వ వారం తర్వాత ఇది కనిపిస్తోంది. ఒకవేళ 20వ వారం కంటే ముందే వారికి హైబీపీ ఉందంటే.. వాళ్లకు అంతకు ముందే రక్తపోటు ఉందని, గుర్తించలేదని అర్థం. హైబీపీ ఉన్న మహిళలు గర్భం దాల్చినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి. తగు సలహాలు తీసుకోవాలి. వైద్యులు సూచించిన మందులనే వాడుకోవాలి.

జెస్టేషనల్ హైబీపీ

గర్భిణుల్లో వచ్చే హైబీపీని 'జెస్టేషనల్ హైబీపీ' అంటారు. గర్భం దాల్చిన 20వ వారంలో హైబీపీ కనిపిస్తే దాన్ని 'ప్రీ అక్లాంప్సియా' అంటారు. వీరు ప్రసవమైన ఆరు వారాల తర్వాత మళ్లీ మామూలు స్థితికి వచ్చేస్తారు. అలాగే అక్లాంప్సియా సమస్య ఉన్నవారిలో అది ఫిట్స్‌కు దారితీయవచ్చు. ఇది చాలా తీవ్రమైన సమస్య. అందువల్ల ప్రీ–అక్లాంప్సియా దశలో ఉన్నప్పుడే చికిత్స తీసుకోవడం మంచిది. మహిళల్లో గర్భధారణకు, బీపీ పెరగడానికి సంబంధం ఉన్నట్లు వైద్య నిపుణుల పరిశీలనలో తేలింది. ప్లాసెంటా పెరుగుదలతో ఏర్పడే కొత్త రక్తనాళాలు అభివృద్ధి చెందడంతోనే సమస్య వస్తుందని నిపుణుల అభిప్రాయం.

చిత్తూరు జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	సీహెచ్‌సీలు
1	8
ఏరియా ఆస్పత్రులు	**పీహెచ్‌సీలు**
4	50

ప్రసవ వివరాలు...

నెల	మొత్తం ప్రసవాల సంఖ్య	బీపీ కేసులు
జనవరి	2,548	215
ఫ్రిబవరి	1.985	184
మార్చి	2,891	282
ఏప్రిల్	2,671	146
మే	3,011	216

నష్టాలు ఇలా..

- ప్రీ–అక్లాంప్సియా సమస్య వల్ల కాబోయే తల్లికి పక్షవాతం రావచ్చు
- మూత్రపిండాలు, కాలేయ వ్యాధుల బారిన పడవచ్చు
- రక్తం గడ్డకట్టే అవకాశాలు ఉండవచ్చు
- బిడ్డ ఎదుగుదలలో సమస్య తలెత్తవచ్చు
- నెలలు నిండకముందే ప్రసవం, లేదా మృతశిశువు పుట్టే అవకాశం ఉంటుంది



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి జిల్లా సమాచారం

టీచింగ్ ఆస్పత్రులు	ఏరియా ఆస్పత్రులు
2	3
సీహెచ్‌సీలు	**పీహెచ్‌సీలు**
7	58

ప్రసవ వివరాలు...

నెల	మొత్తం ప్రసవాల సంఖ్య	బీపీ కేసులు
జనవరి	5,897	461
ఫ్రిబవరి	6.012	1428
మార్చి	5,241	289
ఏప్రిల్	5,819	354
మే	6,105	366



జాగ్రత్తలు ఇలా..

- గర్భం దాల్చిన వెంటనే ప్రభుత్వాస్పత్రి, హెల్త్ సెంటర్‌ను ఆశ్రయించాలి
- లేకుంటే ఏఎన్ఎం, ఆశవర్కర్లకు సమాచారం అందించాలి
- వారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా చూస్తారు
- పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పిస్తారు
- బీపీ, మధుమేహం ఉంటే పర్యవేక్షణలో ఉంచుతారు
- బీపీ నిర్ధారణ అయితే హైరిస్క్ కేసుగా గుర్తిస్తారు
- ప్రసవ సమయంలో ఇంటి నుంచి ఆస్పత్రికి దగ్గరుండి తీసుకెళతారు

డాక్టర్‌ను సంప్రదించాలి

భరించలేనంత తలనొప్పి, కళ్లు సరిగా కనిపించకపోవడం, మసక బారినట్లుగా ఉండడం, పొట్టనొప్పి, వేవిళ్లు కాకుండా ఆ తర్వాత కూడా వాంతులు, కడుపులోని బిడ్డ కదలికలు సరిగా లేకపోవడం, గర్భం దాల్చిన కొంతమందిలో ముఖం ఉబ్బడం, కాళ్లు–చేతుల వాపు చాలా సాధారణం. అయితే ప్రీ–అక్లాంప్సియా ఉంటే అది పరిస్థితిని మరింత తీవ్రం చేస్తుంది. అలాంటి సమయంలో డాక్టరును తప్పక సంప్రదించాలి. ఇంట్లోనే వైద్యం అంటే కుదరదు. చాలా మంది గర్భిణి అని తెలిసినా వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. తద్వారా ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

– ఉషశ్రీ, గైనకాలజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి



తుది దశకు బదిలీల కౌన్సెలింగ్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. చిత్తూరు (31 మండలాలు), తిరుపతి (19 మండలాలు), అన్నమయ్య (15 మండలాలు) జిల్లాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు 897 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం కొంతమందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలిన వారికి గురువారం నిర్వహించే కౌన్సెలింగ్‌తో బదిలీల ప్రక్రియ పూర్తవుతుంది. అభ్యంతరాలను 16వ తేదీన స్వీకరిస్తారు.

- దరఖాస్తు చేసుకున్న 897 మంది సచివాలయ ఉద్యోగులు
- కొన్ని శాఖల్లో బుధవారం నుంచి ప్రారంభమైన కౌన్సెలింగ్
- మిగిలిన శాఖల ఉద్యోగులకు నేడు
- 16న అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు స్థానికంగానే ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019లో బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల్లోనే సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒకే విడతలో లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న సచివాలయాల్లో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వారు నాలుగేళ్లుగా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో వారికి తొలిసారి బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేక నిబంధనలను రూపొందించి ఉత్తర్వులు జారీచేసింది. దివ్యాంగులు, ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలు ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో బదిలీలకు అర్హత ఉన్న ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు క్షుణ్ణంగా పరిశీలించారు.



గ్రామ సచివాలయ ఉద్యోగులు

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన నిబంధనలను ప్రకారం బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ ఎంపీఈవోస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్– 5, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్– 6 (డిజిటల్ అసిస్టెంట్), వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్, వీఆర్వో, వార్డ్ రెవెన్యూ సెక్రటరీ, వార్డ్ ఉమెన్ వీకర్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు బదిలీలకు మొత్తం దరఖాస్తులు 897 మంది చేసుకున్నారు. వీరిలో వైద్య సమస్యలున్న వారు 46 మంది, మ్యూచువల్ 88 మంది, ఇతరులు 660 మంది, ఒంటరి మహిళ 19 మంది, స్పౌజ్ 80 మంది, వితంతువులు నలుగురు ఉన్నారు. వీరికి బుధవారం కొంతమందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలిన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తారు. ఆ తర్వాత బదిలీ అయిన ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేసేలా అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో అభ్యంతరాలను ఈ నెల 16న స్వీకరిస్తారు.

ఉద్యోగి కేడర్	దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు
అగ్రికల్చర్/హార్టికల్చర్ ఎంపీఈవోస్	25 మంది
ఇంజినీరింగ్ అసిస్టెంట్	165 మంది
మహిళా పోలీస్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్	145 మంది
పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్–5)	90 మంది
పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్–6, డిజిటల్ అసిస్టెంట్)	191 మంది
వెటర్నరీ/ఫిషరీస్ అసిస్టెంట్	13 మంది
వీఆర్వో	65 మంది
వార్డు రెవెన్యూ సెక్రటరీ	24 మంది
వార్డు ఉమెన్, వీకర్స్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ	22 మంది
వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్	157 మంది
మొత్తం	897 మంది

నిబంధనల ప్రకారమే బదిలీలు



ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. బదిలీలు పూర్తి అయిన వెంటనే సచివాలయ ఉద్యోగులు కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలి.

– షణ్మోహన్, కలెక్టర్

ప్రతి సమస్యకూ పరిష్కారం

- అర్జీదారుడి ముఖంలో చిరునవ్వు చూడాలి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం
- 'జగనన్నకు చెబుదాం'పై తాడేపల్లి నుంచి వీడియోకాన్ఫరెన్స్

సాక్షి, చిత్తూరు: సమస్యలు పరిష్కారమై లబ్ధిదారుడు చిరునవ్వుతో ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్నకు చెబుదాం, గడప గడపకూ మన ప్రభుత్వం, ఉపాధి హామీ, జగనన్న హౌసింగ్ ప్రోగ్రాం, వ్యవసాయ శాఖ, జగనన్న భూ హక్కు– భూ రక్ష పథకాల పురోగతిపై సమీక్షించారు. చిత్తూరు జిల్లా నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జిల్లా ప్రత్యేక అధికారి జి.వీరపాండియన్, కలెక్టర్ ఎస్.షణ్మోహన్, ఎస్పీ రిశాంత్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీఆర్ఓ ఎన్.రాజశేఖర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా చేపట్టిన పనుల్లో పురోగతి ఉండాలని సూచించారు. ఉపాధి కూలీలకు పనిచేసే చోట షెడ్స్, తాగునీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల భవనాల నిర్మాణ పనుల్లో పురోగతి ఉండాలన్నారు. ప్రతి శనివారం మండలాలతోపాటు మున్సిపాలిటీల్లో సంబంధిత అధికారులు తమ పరిధిలోని రెండు జగనన్న ఇళ్ల కాలనీల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాల పురోగతికి కృషి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, ఎస్పీ రిశాంత్ రెడ్డి, జేసీ పి.శ్రీనివాసులు

ప్రజా సమస్యలకు ప్రాధాన్యం : జిల్లా కలెక్టర్

వీడియోకాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టనున్నారని, ఇందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం సగటు వేతనం అందించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు అవసరమైన రుణ సదుపాయాన్ని కల్పించాలని తెలిపారు. కౌలు రైతులకు కార్డులను సకాలంలో అందజేయాలన్నారు. రెండో దశ పనులను నిర్ణీత సమయంలోపు పూర్తి చేసి జగనన్న భూహక్కు పత్రాలను అందించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీధర్, డ్వామా పీడీ గంగాభవాని, సీపీవో ఉమాదేవి, సర్వే శాఖ ఏడీ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

యాదమరి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. అయన బుధవారం 14 కండిగ ముస్లింవాడలోని జగనన్న కాలనీ, సచివాలయం, ఉర్దూ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవతం చేయాలని, నిర్మాణం చేపట్టని వారి పట్టాలు రద్దు చేయాలన్నారు. అలాగే ఉర్దూ పాఠశాలలో జగనన్న విద్యాకానుక పంపిణీపై ఆరా తీశారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించి స్పందన అర్జీల పరిష్కారంపై ఆరా తీశారు. మాదిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఎంపీడీఓ శివ రాజ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

బంగారుపాళెం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం బంగారుపాళెం మండలం తంబుగానిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, జంబువారిపల్లెలోని జగనన్న లేఅవుట్, తుంబకుప్పం పీహెచ్‌సీని తనిఖీ చేశారు.



మాదిరెడ్డి పల్లె ప్రభుత్వాసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

పాలసముద్రం : రాష్ట్రంలో పేద ప్రజలకు జరుగుతున్న మేలును చూసి చంద్రబాబునాయుడు ఓర్వలేకపోతున్నారని, ఆయనకు ప్రజలే బుద్ధి చెబుతారని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి తెలిపారు. ఆయన బుధవారం పాలసముద్రం మండలం తిరుమలరాజుపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్టే ప్రధాని మోదీకి వెన్నుపోటు పొడిచే స్వభావం కలిగిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా ఏపీలో అవినీతి జరుగుతోందని మాట్లాడడం తగదన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. పేద ప్రజల విద్య కోసం రూ.60,321 కోట్లను ఖర్చు చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు లేకుండా ఒంటరిగానే పోటీ చేసి గెలిచే సత్తా తమ నాయకుడికి ఉందని తెలిపారు. పెత్తందారుల భవిష్యత్తు కోసం నిరంతరం ఆలోచించే చంద్రబాబుకు పేదలంటే చులకనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్, సర్పంచ్ జీవిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణస్వామి

క్లుప్తంగా

పోలీసు జీపు చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రక్షక్ జీపును చోరీ చేసిన కేసులో సూర్య పాండియన్ (23)ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట నిలిపి ఉంచిన వాహనం మూడు రోజుల క్రితం చోరీకి గురైన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సూర్యపాండియన్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి రక్షక్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మేజిస్ట్రేట్ ఆదేశాలతో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఐచర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం ప్రశాంత్ నగర్ కూడలిలోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని మరో ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో అయ్యప్ప (32) అనే వ్యక్తి మృతిచెందాడు. మదనపల్లికి చెందిన అయ్యప్ప కూరగాయలు తీసుకుని మంగళవారం చెన్నై బయలుదేరాడు. అర్ధరాత్రి సమయంలో ప్రశాంత్ నగర్ కూడలి జాతీయ రహదారిపై వెళుతూ ఎదురుగా ఆగి ఉన్న మరో ఐచర్ వాహనాన్ని ఢీకొన్నాడు. అయ్యప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు

- జగనన్న కాలనీల్లో నిర్మాణానికి ప్రతిపాదన
- ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం
- గుంతకు రూ.6 వేల వరకు వ్యయం


ఇంకుడు గుంత(నమూనా చిత్రం)

చిత్తూరు కార్పొరేషన్/చిత్తూరు అగ్రికల్చర్: గ్రామాల్లోని పలు ఇళ్ల వద్ద నేటికి ఇంకుడు గుంతలను చూస్తున్నాం. చిన్న సందులు, ఇరుకైన దారి, నేల గట్టితనం తదితర కారణాలతో కొన్ని ప్రాంతాల్లో కాలువలు నిర్మించేందుకు అవకాశం ఉండదు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేక అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఇళ్ల ముందు వ్యర్థపు నీరు పోవడానికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ పద్ధతిని జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేయాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఒక గుంతకు సుమారు రూ.6 వేల వరకు ఖర్చు అవుతుందని, ఉపాధి హామీ పథకం కింద నిర్మించాలని నివేదించింది. ఈ విధానానికి రాష్ట్ర సాంకేతిక సలహాదారుడిగా విశ్రాంత చీఫ్ ఇంజినీర్ కిషోర్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది.

261 లేఅవుట్లకు ప్రతిపాదన

జిల్లాలో మొత్తం 536 జగనన్న కాలనీల లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో గట్టినేల, నల్లరేగడి నేలలు తదితర పలు సాంకేతిక కారణాల వల్ల కొన్ని లేఅవుట్లలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం వీలు కాదు. 261 లేఅవుట్లలో నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం ఆమోదం లభించగానే ఇంకుడుగుంతల ఏర్పాటు చేసుకోవచ్చు.

రూ.6 వేల వరకు ఖర్చు

లబ్ధిదారుడి ఇంటి వద్ద 3 అడుగుల లోతు, 5.5 అడుగుల పొడవు, 4 అడుగల వెడల్పుతో గుంతను తవ్వుతారు. అందులో అడుగు గులక, జల్లిరాళ్ల మట్టితో నింపుతారు. అనంతరం అందులోకి ఇంటి నుంచి వచ్చే వ్యర్థపు నీరు పైపు ద్వారా వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తారు. దానిపై మట్టి వేసి సిమెంటుతో స్లాబ్ వేసి మూసివేస్తారు. వ్యర్థపు నీరు అందులో చేరి భూమిలో ఇంకిపోతుంది. తద్వారా మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండి దోమలు పెరిగే అవకాశం ఉండదు. అంటువ్యాధులు ప్రబలవు. ఇళ్ల వద్ద కాలువలు నిర్మించే వరకు ఈ ఇంకుడు గుంతలు ఉండడం మంచిదని నిపుణులు అంటున్నారు. గుంత నిర్మించుకున్న తర్వాత బిల్లు పెట్టుకుంటే ఆ మొత్తం బ్యాంకు ఖాతాలో వేసే విధంగా ప్రతిపాదనలు పెట్టారు.

పరిశుభ్రత ముఖ్యం



"ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు ఇంకుడు గుంతలో చేరి భూమిలోకి ఇంకిపోతుంది. వీటి వల్ల పరిశుభ్రమైన వాతవారణం ఉంటుంది. అంటువ్యాధులు ప్రబలవు. కొన్ని లేఅవుట్లలో సాంకేతిక కారణాల వల్ల వీటిని నిర్మించడం వీలు కాలేదు. కాలువలు ఏర్పాటు చేసే వరకు ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే మంచిది.

– శంకర్‌బాబు, ఎస్‌ఈ జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ

21 నుంచి సంపర్క అభియాన్

చిత్తూరు కార్పొరేషన్: ప్రధాని గత 9 ఏళ్ల కాలంలో చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 21 నుంచి సంపర్క కార్యక్రమం నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు తెలిపారు. ఆయన బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అనుబంధ సంఘాల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 30 వరకు జిల్లాలోని ప్రతి ఇంటికీ వెళ్లి మోదీ పాలనకు మద్దతు తెలుపుతూ 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ దుర్గ, నాయకులు షణ్ముగం, గురుగణేష్ తదితరులు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,550
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

నల్ల బ్యాడ్జీలతో చిదా మిల్లు కార్మికుల ధర్నా


మిల్లు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

- లే ఆఫ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్
- డీసీఎల్ సమక్షంలో నష్టపరిహారం నిర్ణయించాలి

పుత్తూరు రూరల్: రెండు నెలల లే ఆఫ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, డీసీఎల్ సమక్షంలో కార్మికుల నష్టపరిహారం నిర్ణయించాలని చిదా స్పిన్నింగ్ మిల్లు కార్మికులు డిమాండ్ చేశారు. వారు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. కార్మిక సంఘం నాయకుడు బాబు మాట్లాడుతూ యాజమాన్యం కార్మిక చట్టాన్ని ఉల్లంఘించి అర్థాంతరంగా మిల్లును మూసివేసిందన్నారు. దీంతో 171 మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యం అందుకు సంబంధించిన వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. డీసీఎల్ సమక్షంలో కార్మికులకు న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఏలుమలై రెడ్డి, రవిచంద్రన్, రామ్మూర్తి, రత్నం, నాగూర్, మాసల, మురగారెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

టీ దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

– మహిళ మృతి, ముగ్గురికి గాయాలు


సంఘటనా స్థలంలో మృతి చెందిన మంజుల

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వద్ద బుధవారం రాత్రి లారీ టీ దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో మహిళ మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. లైనట్లు పోలీసుల కథనం మేరకు.. పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని రోడ్డు పక్కన ఉన్న టీ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో టీ దుకాణం నిర్వాహకురాలు దండువారిపల్లెకు చెందిన మంజుల(48) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త ప్రభాకర్(53), గంగవరం మండలం సరమట్లపల్లెకి చెందిన ట్రాక్టర్ ఓనర్ కమ్ డ్రైవర్ వెంకటేష్(46), లారీ క్లీనర్ మల్లయ్య(31) తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని 108లో బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు.

ఇద్దరు కర్ణాటక మద్యం విక్రేతల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలో బుధవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశా రు. ఈ సందర్భంగా కర్ణాటక మద్యం విక్రయిస్తు న్న రమేష్(55), కృష్ణమూర్తి(42)ని అరెస్టు చేశా రు. వారి నుంచి 74 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ బాబు పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రారంభం

చిత్తూరు అర్బన్ : జిల్లాలోని దిశా పోలీస్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. చిత్తూరు నగరం ప్రశాంత్ నగర్‌లోని జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో అభ్యర్థులకు డ్రైవింగ్ పరీక్ష నిర్వహించారు. మొదటి రోజు 65 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారికి ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత సూత్రాలపై ఇంటర్వ్యూ చేశారు. ఎంపికైన వారికి త్వరలో నియామక పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుధాకర్, ట్రాఫిక్ డీఎస్పీ విష్ణువీర్, అధికారులు శ్రీనివాసరావు, మధుసూదన్‌రావ్, మధు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి నిరూపించుకో బాబు

శాంతిపురం: ఎన్నికలు వస్తున్నాయని డ్రామాలకు తెరతీయకుండా మాదిగల పట్ల చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ నాయకుడు దేవరాజులు మాదిగ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖను సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ ఎస్సీలలోని 59 ఉప కులాలను వర్గీకరించి తానే మాదిగల్లో పెద్ద మాదిగ అని చెప్పుకున్నారని, విజయవాడలో సభ పెడితే లాఠీలతో కొట్టించారని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు వాడుకుని, తర్వాత కేసులతో ఇబ్బంది పెట్టే ఆలోచనలు వద్దని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే వర్గీకరణపై పార్లమెంటు సమావేశాలలో ప్రైవేటు బిల్లు పెట్టాలని చంద్రబాబునాయుడిని డిమాండ్ చేశారు.



ఒకరు సరదాగా వచ్చి.. ఇంకొకరు కాపాడేందుకు వెళ్లి..

- మైపాడు బీచ్‌లో ఇద్దరి మృతి


సన్నీగౌడ్ మృతదేహం


చెంచువర్ధన్ మృతదేహం

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు బీచ్‌లో బుధవారం ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఒకరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లాకు చెందిన 28 మంది ఈనెల 11న తిరుమలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మైపాడు బీచ్‌కు వచ్చారు. వారిలో భీమగోని సన్నీగౌడ్ (21), అతడి పిన్ని చిన్నమ్మ అలల తాకిడికి నీటిలో మునిగి కేకలు వేయసాగారు. చిల్లకూరు మండలం అంకులపాటూరుకు చెందిన ఆడిపూడి చెంచువర్ధన్ (20) తన స్నేహితులు మల్లికార్జున, మణికంఠ, శ్యామ్యూల్‌తో కలిసి బీచ్‌కు వచ్చాడు. సన్నీగౌడ్, బంధువుల కేకలు విని రక్షించేందుకు వెళ్లాడు. సన్నీ వద్దకు చేరుకోకముందే చెంచువర్ధన్ అలల్లో చిక్కుకుని నీటిలో మునిగిపోయి విగతజీవిగా మారి ఒడ్డుకు చేరుకున్నాడు. బంధువులు సన్నీగౌడ్, చిన్నమ్మను ఒడ్డుకు చేర్చి ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తేల్చారు. చిన్నమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. సన్నీగౌడ్ మృతితో తల్లిదండ్రులు బాలరాజ్‌గౌడ్, విజయమ్మ కన్నీరుమున్నీరతున్నారు. కాపాడేందుకు వెళ్లి చెంచువర్ధన్ చనిపోవడంతో స్నేహితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి ఇందుకూరుపేటకు చేరుకుని వివరాలు ఆరాతీశారు. ఎస్సై వెంకటరాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతులకు వరం పశు బీమా

బంగారుపాళెం: వైఎస్సార్ పశుబీమా పథకం పాడి రైతుల పాలిట వరమని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ తెలిపారు. స్థానిక పశు వైద్య కేంద్రంలో బుధవారం బంగారుపాళెం, యాదమరి మండలాల పశువైద్య సిబ్బందికి పశుబీమాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, పాడి రైతులు పశు బీమా చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రమాదవశాత్తు పాడిపశువులు మరణిస్తే బీమా నగదు రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు ఐదు పశువులకు మూడేళ్ల వరకు బీమా చేసుకోవచ్చన్నారు. 50 గొర్రెలకు బీమా చేసుకోవచ్చని సూచించారు. గురువారం నుంచి మేకలు, గొర్రెలకు డీవార్మింగ్ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ ఆరీఫ్, ఏడీ విజయమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- రూ.3.45 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితులు నలుగురూ ఓజీకుప్పం గ్రామస్తులు
- వివరాలు వెల్లడించిన కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు

కళ్యాణదుర్గం(అనంతపురం జిల్లా): బ్యాంకుల వద్ద ప్రజలను ఏ మార్చి నగదు అపహరించే నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను కళ్యాణదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ బి.శ్రీనివాసులు, పట్టణ సీఐ తేజమూర్తి, ఎస్ఐలు నాగమధు, సుధాకర్, ఆశాబేగం వెల్లడించారు. ఈ నెల 1వ తేదీన కళ్యాణదుర్గంలోని గ్రామీణ బ్యాంకులో రూ.2 లక్షలు నగదును డిపాజిట్ చేసేందుకు వచ్చిన డీటీహెచ్ డీలర్ రవికుమార్ ద్విచక్రవాహనంలో నుంచి ఆయనకు తెలియకుండానే నగదును దుండగులు అపహరించుకెళ్లారు. అలాగే 9వ తేదీన బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లికి చెందిన రైతు చాకలి శంకరయ్య కళ్యాణదుర్గంలోని యూనియన్ బ్యాంక్‌లో పంట రుణం రెన్యువల్ కోసం రూ.1.45 లక్షలను తీసుకురాగా, ద్విచక్ర వాహనంలోని ఆ డబ్బును తెలివిగా దొంగలించారు. ఆయా ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం కళ్యాణదుర్గం సమీపంలో తచ్చాడుతున్న నలుగురిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో బ్యాంక్‌ల వద్ద నగదు అపహించుకెళ్లింది వారేనని తేలింది. పట్టుబడిన వారిలో చిత్తూరు జిల్లా నగరి మండలం కావేటిపురం పంచాయతీలోని ఓజీ కుప్పం గ్రామానికి చెందిన కుంచల సుబ్రమణ్యం, పసుపులేటి వినోద్, గోగుల తులసేందర్, పసుపులేటి రమేష్ ఉన్నారు. వీరి నుంచి రూ.3.45 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. కాగా, నిందితులపై గతంలో ప్రకాశం, తూర్పు గోదావరి, నెల్లూరు, కృష్ణా జిల్లా, హైదరాబాద్, కర్ణాటకలోని బీదర్, తమిళనాడులోని తిరుత్తణి, కాంచీపురంలో కేసులు నమోదయ్యాయి. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

సుమో ఢీకొని తండ్రి మృతి

- కొడుకుకు తీవ్ర గాయాలు


మృతి చెందిన కృష్ణమూర్తి

పుంగనూరు: పుంగనూరు సమీపంలోని టోల్ ప్లాజా వద్ద బుధవారం బైక్‌ను సుమో ఢీకొనడంతో తండ్రి మృతిచెందగా కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్లకు చెందిన కృష్ణమూర్తి(55), ఆయన కుమారుడు హరి (30) బైక్‌లో బుధవారం మదనపల్లె వైపు వెళుతున్నారు. పట్టణ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన సుమో ఢీకొంది. ద్విచక్ర వాహనాన్ని కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి అక్కడికక్కడే దుర్మరణం చెందగా హరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే హరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి..


మృతుడు నూరుల్లా(ఫైల్)

పెద్దపంజాణి: మండలంలోని నగిరేపల్లి-తుర్లపల్లి రోడ్డులో బుధవారం రెండు బైకులు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌హెచ్‌ఓ రెడ్డెప్ప కథనం మేరకు.. మండలంలోని చిన్నేపల్లికి చెందిన నూరుల్లా(40) భార్యతో కలిసిబైక్‌లో నిమ్మనపల్లిలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. అదే విధంగా తుర్లపల్లికి చెందిన ప్రశాంత్ బైక్‌లో పుంగనూరుకు బయలుదేరాడు. నగిరేపల్లి-తుర్లపల్లి రోడ్డులో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన నూరుల్లాను స్థానికులు పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి సోదరుడు అతావుల్లా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తు స్తున్నారు. ప్రశాంత్‌కు గాయాలయ్యాయి.

ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా దేవా


నియామకపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగమైన ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు నగరం తేనెబండకు చెందిన దేవాను నియమించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో బుధవారం దేవాకు నియామక పత్రం అందించారు.